క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : కాశిందేవిపేట సబ్‌స్టేషన్ మధ్య లైన్ మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సన్మానం


శ్యామ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్ : జేడీ మల్లంపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్యామ్‌రావు ఎన్నిక కాగా స్థానిక నాయకులు సన్మానించారు. ఈ మేరకు గురువారం శ్యామ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో గోల్కొండ రాజు, గొర్రె కుమార్, చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బక్కి నాగరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులతో సమీక్ష



వాజేడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీఓ శ్రీకాంత్ పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ పారిశుద్ధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి

మంగపేట : సరైన అనుమతులు లేకుండా ఎవరు కూడా దీపావళి బాణసంచా విక్రయించొద్దని ఎస్సై టీవీఆర్ సూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో దీపావళి బాణసంచా విక్రయించే వ్యాపారస్తులు తప్పని సరిగా అనుమతి పొందాలన్నారు. అనుమతి ఉన్న స్థలంలోనే బాణసంచా విక్రయించాలని, అగ్నిమాపక శాఖ నిబంధనల మేరకు తగిన ఏర్పాట్లు ఉండాలని నిబంధనలకు అతిక్రమించిన, అనుమతులు లేకుండా విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అదే విధంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే ట్రాఫిక్ నిబంధనల యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

మంగపేట : మండలంలోని తిమ్మంపేటకు చెందిన పూసల కన్నయ్య కుమారుడు రాంచరణ్ సూర్యాపేట మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఎంబీబీఎస్ సీటు సాధించడాన్ని అభినందిస్తు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు మంత్రి సీతక్క తనయుడు నియోజకవర్గ యువ నాయకుడు కుంజ సూర్య రూ.25వేల నగదును పంపించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం విద్యార్థిని అందజేశారు.

మిత్రుడి కుమార్తెకు..



ఏటూరునాగారం : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన యన్నమల్ల తిరుపతి కుమార్తె స్వాతిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. అయితే మిత్రుడు తిరుపతి మృతిచెందడంతో బాధిత కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సాత్విక అడ్మిషన్‌కు గురువారం తిరుపతితో కలిసి 1997–98లో పదోతరగతి చదివిన మిత్రులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కందుకూరి సుధాకర్, నగేష్, ముక్కెర భిక్షపతి, మంతెన రాజేష్ తదితరులు ఉన్నారు.

కొండచిలువ కలకలం



కన్నాయిగూడెం : అడవిలో ఉండాల్సిన కొండచిలువ బుధవారం రాత్రి మండలంలోని బుట్టాయిగూడెం ప్రధాన రహదారి పైకి వచ్చింది. నిత్యం ఈ రోడ్డుపై రాత్రి పగలు అనే తేడా లేకుండా అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొండచిలువ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు గమనించకుండా కొండచిలువపై నుంచి వెళ్లినప్పుడు అది అక్కడికక్కడే మృతిచెంది ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు. గురువారం ఉదయం గ్రామస్తులు కొండచిలువను చూసి భయాందోళనకు గురయ్యారు.

రోడ్డు ఇలా..ప్రయాణించేదెలా?

- ప్రధాన రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పాలాయిగూడెం వద్ద నీరు నిలిచి కాల్వను తలపిస్తున్న రోడ్డు, గుంతను చదును చేస్తున్న పొక్లెయిన్

మంగపేట : కుంగిన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఓ వైపు కాల్వలు తలపిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డుపై ఎదురుగా ఏదైనా వాహనం వస్తే కిందికి దిగే పరిస్థితి లేకుండా ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. మండలంలోని మల్లూరు నుంచి రాజుపేట వరకు పది కిలోమీటర్ల మేర ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రెండు ఫీట్ల లోతుతో వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా తయారైంది. రెండేళ్ల నుంచి నేటివరకు మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రాజుపేట ఇసుక లోడింగ్ కోసం వచ్చే వందలాది లారీలను రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో మల్లూరు నుంచి రాజుపేట వరకు సుమారు 10 కిలోమీటర్ల వరకు ప్రధాన రోడ్డు కుంగిపోయింది. ఇదిలా ఉండగా మంగపేట నుంచి ఏటూరునాగారం వరకు ప్రధాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లు, ఇతర ప్రైవేటు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఇసుక లారీలు బోల్తాపడిన సంఘటనలు ఉన్నాయి. ఏటూరునాగారం నుంచి మంగపేట, మణుగూరు వరకు వివిధ రకాల పనులపై నిత్యం బైక్, కార్లు, ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రజలు, అధికారులు రోడ్డుపై ప్రయాణిస్తుడడం వల్ల నడములు పోతున్నాయని, విలువైన వాహనాలు సైతం రిపేర్‌కు వస్తున్నాయని వాపోతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

నామమాత్రంగా మరమ్మతులు

ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20.40 లక్షల ఫ్లడ్ డ్యామేజ్ నిధులు మంజూరు చేసింది. అయితే అధికారులు నామమాత్రంగా గుంతల్లో సీసీ రోడ్ల వేస్టేజీ, మట్టితో నింపి చేతులు దులుపుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గుంతల రోడ్డుపై వాహనదారులు, ప్రజలు పడుతున్న అవస్థలను తెలుసుకున్న మంత్రి సీతక్క, అధికారులతో మాట్లాడి త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

మారని అధికారుల తీరు..

అధికారులు మారుతున్నా వారిలో వైఖరి మాత్రం మారడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటూరునాగారం నుంచి జిల్లా సరిహద్దు ప్రధాన రోడ్డుకు ప్రతి మేడారం జాతర సందర్భంగా రోడ్డుపై ప్యాచ్ వర్క్, ఇయర్ మెయింటెనెన్స్, బీటీ రెనివల్ తదితర పనులకోసం రూ.16 కోట్ల వరకు ఖర్చు చేశారు. అప్పటి ఆర్అండ్‌బీ అధికారుల స్వలాభం రోడ్డుకు శాపమైంది. ప్రస్తుతం వారి స్థానంలో నూతనంగా వచ్చిన అధికారులు మరమ్మతులు చేపట్టడంలో అదే వైఖరిని అవలంబిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

తాత్కాలిక మరమ్మతులు

ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చదును చేయిస్తున్నాం. ప్యాచ్ వర్క్ చేసేందుకు ఆంధ్రా నుంచి వర్కర్స్ వచ్చే సరికి రెండు, మూడు రోజులు పట్టనుంది. అప్పటి వరకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం. వర్కర్స్ రాగానే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి బీటీ వేయిస్తాం.

– వెంకటేష్, ఆర్అండ్‌బీ ఏఈ

పర్యావరణ రక్షణకు పాటుపడాలి


పోస్టర్లను ప్రదర్శిస్తున్న క్లబ్ సభ్యులు తదితరులు

ములుగు రూరల్ : పర్యావరణ రక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్‌కోర్ సహకారంతో ఏకో బజార్‌ను ఏకో క్లబ్ కన్వీనర్ సరిత ఆధ్వర్యంలో 8స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పర్యావరణ హితమైన ఉత్పత్తులు కాటన్ టవల్స్, మట్టితో చేసిన దీపాంతలు, కుండలు, టీ కప్పులు, కాటన్ డోర్ మ్యాట్స్, కర్చీఫ్, సంచులు, తినుబండారాలు మిల్లెట్స్‌తో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. అనంతరం ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, కవిత, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి


సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యమున

మంగపేట : ఎవరైనా అకస్మాత్తుగా గుండెపోటు బారినపడిన వెంటనే వారికి సీపీఆర్ చేసి ప్రాణం కాపాడొచ్చని చుంచుపల్లి వైద్యాధికారి యమున తెలిపారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా చాలా మంది హార్ట్ ఎటాక్‌తో చనిపోతున్నారని అన్నారు. గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ అనేది కీలక పాత్ర పోషిస్తుందని, సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గుండెపోటు లక్షణాలు ఎలా ఉంటాయి, ఎవరికైనా హార్ట్ ఎటాక్ వస్తే వారికి ఎలా సీపీఆర్ చేయాలని అనే అంశాలను వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలనే విషయంపై ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సీతమ్మ, సారమ్మ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అనూష

కన్నాయిగూడెం : బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని బాలల భరోసా కేంద్రం ద్వారా కానిస్టేబుల్ అనూష సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు బాలల చట్టాలు, బాల్య వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం అనూష మాట్లాడుతూ... విద్యార్థులు బాల్య వివాహాలు జరిగితే తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చిన డయల్–100కు లేదా 1098 ఫోన్ చేయాలన్నారు. అనంతరం పాఠశాల ప్రత్యేక అధికారి అశ్విని మాట్లాడుతూ.. విద్యార్థులు బాలల చట్టాల అవగాహనతో పాటు చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలు రావడంతో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తోందన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ములుగు రూరల్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకుని, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలో అటవీ శాఖ మొబైల్ పార్టీ ఎఫ్ఆర్ఓ శ్రావణి కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ టోల్‌గేటు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న క్రమంలో పాత వే బిల్లుతో ఇసుక రవాణా చేస్తున్నట్లుగా గుర్తించామని తెలిపారు. ప్రస్తుత వే బిల్లు లేకుండా పాత వే బిల్లు పై ఇసుక తరలించడం చట్టరీత్యా నేరమని, సదరు లారీల యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేసి లారీలను ములుగు అటవీ శాఖ కార్యాలయానికి తరలించినటు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్ఓలు రాంబాబు, బాలజీ, ఎఫ్‌బీఓ అనిల్ ఉన్నారు.

టీఎల్ఎం ఉపయోగించి బోధించాలి


పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరావు

వాజేడు : వాజేడు, మొరుమూరు ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ప్రతీ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా టీఎల్ఎం ఉపయోగించి విద్యార్థులకు బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు టీచింగ్ డైరీని తప్పనిసరిగా రాయాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న శ్రీనివాస్

ఎస్ఎస్‌తాడ్వాయి : విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఇన్‌చార్జ్ ఎంఈఓ గద్దె శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఎంపికైన మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బాణాల సుధాకర్, విద్యాసాగర్, రేవతి, నంద కిషోర్, కేజీబీవీ స్పెషలాఫీసర్ పుష్పనీల, పాయం మానేశ్వర్‌రావు, బాబురావు, సమ్మయ్య, సురేందర్, రజిత, ప్రభాకర్, లక్ష్మణరావును శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. రిటైర్డ్ ఎంఈఓ కేశవరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుతారి పాపారావు, అల్లెం భాస్కర్, కొర్నెబెల్లి నారాయణరావు, రాజు, శాంసన్, కృష్ణయ్య, రేగ నరేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలించొద్దు



వెంకటాపురం(ఎం) : గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను, కూలీలను తరలించొద్దని వెంకటాపురం ఎస్సై చల్ల రాజు వాహనదారులను హెచ్చరించారు. గురువారం మండలంలోని జవహర్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు ఎస్సై కౌన్సిలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించొద్దని సూచించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వెంకటాపురం(కె) : సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భాస్కర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన గంగారం, మహితాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కోటి రెడ్డి, సిబ్బంది స్వప్న, రాఘవులు ఉన్నారు.

చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : నార్లాపూర్ సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయ గూడేనికి చెందిన వెట్టి సంతోష్ భార్య సోని పండంటి బాబుకు జన్మనిచ్చి జాండీస్ బారినపడి ఇటీవల మృతిచెందింది. దీంతో తల్లిపాలు తాగిన చిన్నారికి సైతం జాండీస్ సోకి అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క సదరు చిన్నారికి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి ప్రత్యేక చికిత్సను అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించినట్లు తెలిపారు. గురువారం మంత్రి సీతక్క, ఆదేశాల మేరకు పీఏ సంతోష్ ఎంజీఎంకు వెళ్లి వైద్య చికిత్స పొందుతున్న చిన్నారి (బాబు) కుటుంబాన్ని కలిశారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి సీతక్క బాబు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య వివరాలను తెలుసుకుని అధైర్యపడొద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైద్యులతో సీతక్క మాట్లాడి చిన్నారి ఆరోగ్యం బాగుందని భరోసా ఇచ్చారు. చిన్నారి ఆరోగ్యం కాపాడేందుకు సహకరించి, మెరుగైన వైద్యం అందేలా కృషి చేసి, ఆర్థిక సాయం చేసిన మంత్రి సీతక్కకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


కన్నాయిగూడెం: ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రూప్ సభ్యులు


ఎస్ఎస్‌తాడ్వాయి: బాధితులను పరామర్శిస్తున్న నాగజ్యోతి తదితరులు

మంగపేట : మండలంలోని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని రేగులగూడెనికి చెందిన మడకం లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గురువారం పరామర్శించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, డీసీసీ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి పరామర్శించి రూ.5వేల నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యానయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన కట్ల సాంబయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే నార్లాపూర్ సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయగూడెంలో ఎట్టి సోని ఇటీవల జాండీస్‌తో బాధపడుతూ మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లయ్య, ఉపాధ్యక్షుడు చల్ల రజనీకర్ రెడ్డి, దుర్గం రమణయ్య, నాయకులు ఎట్టి జగదీష్, గడ్డం అరుణ, చిడం బాబురావు, గుర్రం రమ–సమ్మిరెడ్డి, ఆలేటి ఇంద్రారెడ్డి, యూత్ అధ్యక్షుడు కోట సురేష్, నాయకులు పత్తి గోపాల్‌రెడ్డి, పైడాకుల ఆశోక్, సిద్ధబోయిన శివరాజ్, గోపాలపురం సతీష్ చారి, మొక్క భాస్కర్, నేలటూరి సతీష్, సంకె ప్రణయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


మంగపేట: సాయం అందజేస్తున్న నాయకులు

ముప్పనపల్లి సహాయ నిధి ఆధ్వర్యంలో..


కన్నాయిగూడెం : మండల కేంద్రానికి చెందిన రైతు కొయ్యల సమ్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో విషయం తెలుసుకున్న ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ సభ్యులు రూ.7వేల సాయం అందజేశారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న అధికారులు, నాయకులు


వెంకటాపురం(కె) : కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్, తహసీల్దార్ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లోని 350 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం, నూనె, కూరగాయలు, దుప్పట్లు, తదితర వస్తువులను సీఐ, తహసీల్దార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మహిళలు, చిన్నారుల సమస్యలపై సఖి అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, కాంగ్రెస్ నాయకులు మురళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు గుడవర్తి నర్సింహామూర్తి, కోఆర్డినేటర్స్ గొంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, నరేష్, ప్రసాద్, భాస్కర్, స్వరూప, పద్మ, ఉష, ఇందిరా, రమాదేవి తదితరులు ఉన్నారు.

కపాస్ కాటన్ యాప్‌పై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో కపాస్ కాటన్ యాప్ వినియోగంపై వ్యవసాయ కమిషనర్, వ్యవసాయ డైరెక్టర్ ఆధ్వర్యంలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఏఓ శ్రీజ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ఈ వానాకాలంలో పంట నమోదు ప్రక్రియ, పత్తి అమ్మకానికి కపాస్ కాటన్ యాప్ ప్రాధాన్యం, వినియోగం, సమగ్ర వ్యవసాయ యాంత్రీకరణ గురించి క్లుప్తంగా వివరించినట్లు ఏఓ చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి జే.బాపు, ఏడీఏలు రమేశ్, శ్రీపాల్, ఉద్యానవన శాఖ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, మండల ఏఓలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

గొల్లకొత్తూరులో పోషణ మాసోత్సవం



ఏటూరు నాగారం: మండల పరిధిలోని చిన్నబోయినపల్లి సెక్టార్‌లో గల గొల్లకొత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూపరాణి పోషణ మాసం ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వసంత తదితరులు ఉన్నారు.